క్లుప్తంగా

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి



గార్ల: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించడం వలన పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.ఎల్లమ్మ సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం గార్లలోని రైతువేదిక భవనంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సూపర్‌వైజర్ కె.సంపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సుజాత, కృష్ణకుమారి, సరిత పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థికసాయం



గంగారం: గంగారం మండలంలో పనిచేస్తున్న ఈఎంటీ పూనెం స్వరూప భర్త పూనెం కోటేశ్వర్‌రావు అనారోగ్యంతో మృతిచెందాడు. పూనెం కోటేశ్వర్‌కు ఒక కూతురు ఉంది. ఆ పాప కోసం తోటి ఉద్యోగస్తులు, 108 ఉమ్మడి వరంగల్, తెలంగాణ ఉద్యోగులు తమ వంతు సహాయంగా పాప పేరు మీదుగా సుకన్య సమృద్ధి యోజన పథకం కింద రూ.లక్ష హన్మకొండ పోస్టాఫీస్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఈఎంఈ రాము, ఉద్యోగస్తులు పప్పుల వెంకన్న, లాకవత్ బాలాజీ, చైతన్య, స్వామి, చంద్రసేన, ఫక్రుద్దీన్, భిక్షపతి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన



కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంబరీష సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓగా బాధ్యతలను స్వీకరించి మొదటిసారిగా పీహెచ్‌సీకి వచ్చిన సందర్భంగా వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరీ, డాక్టర్లు విరాజిత, సురేందర్, హెచ్‌ఈఓ గౌసుద్దీన్, శ్రీధర్, వినోద, సుహాసిని పాల్గొన్నారు.

గోసంపదను కాపాడుకుందాం..



పెద్దవంగర: గోసంపదను కాపాడుకోవడం మన అందరి బాధ్యతని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో గోశాల ప్రతినిధి కిరణ్ ఆధ్వర్యంలో పది మంది రైతులకు లేగదూడలను ఉచితంగా పంపిణీ చేశారు.

నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ మోసం

మహబూబాబాద్ రూరల్: నిరుద్యోగ భృతిపై కలెక్టర్ కార్యాలయాల ముట్టడికి తయారవుతున్న బీజేవైఎం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని మహబూబాబాద్ టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మదన్ లాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డు నోటిఫికేషన్లు, పరీక్షల, నియామకాలను తప్పుల తడకగా మార్చి నిరుద్యోగులు, యువకులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేసిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగ అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్ 2 పరీక్షకు 3నెలల సమయం ఇచ్చి తరువాత పరీక్ష నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో యువతకు ప్రతినెలా చెల్లిస్తామని హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ప్రతినెలా రూ.3,016, ఇప్పటివరకు 56నెలల మొత్తం రూ.1,68,896 మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళీ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్ రాయుడు, నాళ్ల రమేష్, కార్యకర్తలు నవీన్, సురేష్, బాలునాయక్, సురేష్, ప్రేమ్, సురేందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: బీజేపీ, బీజేవైఎం నాయకులను అరెస్ట్ అప్రజాస్వామికం అని బీజేపీ పార్టీ మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు. ముందస్తుగా నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. అరెస్టయిన వారిలో కొమ్ము శోభన్, పూజారి విష్ణు, అల్లం సాయికుమార్ ఉన్నారు.



మహబూబాబాద్ రూరల్: పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

పెద్దవంగర: సీఎం కేసీఆర్ ఇచ్చిన నిరుద్యోగ భృతి హామిని అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. ముట్టడికి వెళ్లకుండా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్, తలారి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: గార్లలో అరెస్టయిన వారిలో బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్ జైన్, ఎడ్ల రాజశేఖర్, కత్తి రాజేష్, అజ్మీర రాము, దేవా ఉన్నారు.

కేసముద్రం: బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కరుణాకర్ ఉన్నట్లు తెలిపారు.



కేసముద్రం: అరెస్టయిన బీజేపీ నాయకులు



కురవి పోలీస్‌స్టేషన్‌లో..

కురవి: పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజు, పెంటయ్య, భద్రసేనాగౌడ్ ఉన్నారు.

నాపై నమ్మకం ఉంటేనే ఓటెయ్యండి..

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం: అందరికి అందుబాటులో ఉండి పనిచేస్తాననే నమ్మకం నాపై ఉంటేనే ఓటెయ్యండని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మండల సాధికారత సహాయ సహకార పొదుపు పరపతి, మార్కెటింగ్ మండల సమాఖ్య 14వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే కొందరు వలస పక్షుల్లాగా వచ్చి, మాయమాటలు చెప్పి ఓట్లడిగితే వారిని నమ్మవద్దన్నారు. అర్ధరాత్రి 12గంటలకు ఎవరికి ఏ ఆపదవచ్చినా ఫోన్ చేస్తే నేను స్పందిస్తాననే నమ్మకం నాపై ఉంటే ఓట్లేసి గెలిపించాలన్నారు. ఓట్లేసి గెలిపించాక గల్లా పట్టి పనిచేపించుకునే హక్కు మీకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్, సర్పంచులు ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు న్యాయం

మహబూబాబాద్: సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు న్యాయం చేశారని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు కమీషన్ పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేకు బొకే, శాలువా తీసుకెళ్లగా ఎమ్మెల్యే ఆ శాలువాతో సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటనారాయణ, రాంచందర్, శంకర్, వెంకన్న, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రూపురేఖలు మార్చిన ఘనత కేసీఆర్‌దే

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్: అభివృద్ధి పరంగా తెలంగాణ రూపురేఖలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. మండలంలోని చిలుకొయ్యలపాడు, అందనాలపాడు, మోదుగడ్డ తండా మన్నెగూడెం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో చివరిసారి పోటీ చేస్తానని నియోజకవర్గ ప్రజలు దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు కమలా రామనాథం, బీఆర్ఎస్ అధ్యక్షుడు నున్నా రమణ, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, సర్పంచులు ఆంగోత్ మోహన్, రమేష్, పీఎసీసీఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



డోర్నకల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

ఎమ్మెల్యేకు సన్మానం

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజ్‌పల్లి గ్రామం నుంచి పెద్దచెరువు, భీమ్లాతండా వరకు బీటీ రోడ్డు మంజూరైన సందర్భంగా నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్‌రెడ్డి, గంగన్న, శ్రీను, ఐలయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని ఐదు హుండీల లెక్కింపు శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా పరిశీలకులు నందనం కవిత పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీల ఆదాయం రూ.1,50,475 వచ్చినట్లు ఆలయ ఇఓ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రమేష్, సభ్యుడు వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

ఎరుకలను ఆదుకోవాలి

తొర్రూరు: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న ఎరుకలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎరుకల సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నడిగడ్డ శైలజ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఎరుకల సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తిరుపతి ఏసు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జ్యోతి, పెద్దవంగర అధ్యక్షుడిగా అంజయ్య, మహిళా అధ్యక్షురాలిగా అనూష, దంతాలపల్లి అధ్యక్షుడిగా సారంగం, మహిళా అధ్యక్షురాలిగా అంగిడి శోభలు నియమితులయ్యారు.

క్షీరాభిషేకం

కురవి: మండలంలోని నల్లెల్ల శివారు సూర్యతండాను ప్రత్యేక జీపీగా ప్రతిపాదన పంపగా సీఎం కేసీఆర్ ఆమోదానికి నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ తండావాసులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈనెల 12న నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలి టీఎస్ పీసీఎస్‌ఈయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.హరినాయక్ శుక్రవారం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ శాఖ కార్యాలయ అధికారుల మద్దతు తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఓంకార్, భాస్కర్, వీరన్న, అశోక్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీఎస్ పీసీఎస్‌ఈయూ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

గూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు సోనబోయిన రవిచంద్ర డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కమలాకర్‌రెడ్డి, ప్రవీణ్, స్వామినాథన్, చంద్రమౌళి, మల్లేషం పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు

గూడూరు: అభివృద్ధి పేరుతో పాఠశాలను దత్తత తీసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కోరె వెంకన్నపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు దేవేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని పొనుగోడు జెడ్పీహెచ్ఎస్ ఎదుట శుక్రవారం విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాల సమస్యపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దత్తత పేరుతో తనకు సంబంధంచిన వ్యక్తిని ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌గా నియమించాడని, అతను నిరుపేద విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడి, చివరకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రశ్నించే స్థాయికి చేరాడన్నారు. ఈ విషయమై దత్తత తీసుకున్న గ్రామానికి చెందిన వ్యక్తి కోరె వెంకన్న జిల్లా అధికారులకు హెచ్‌ఎంపై తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని అన్నాడు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గణేశ్, సాయికుమార్, అఖిల్, సాయిరాం విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

నెహ్రూసెంటర్: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారధిరెడ్డి, ఏఎన్ఎం యూనియన్ నాయకురాలు ధారా జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు సెంటర్‌లో మానవహారం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడారు. ఏఎన్‌ఎంలు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంల సమస్యలపై కాంగ్రెస్ గళమెత్తాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, సెకెండ్ ఏఎన్‌ఎంలు అశ్విని, సుమలత, రాములమ్మ, తులసి, విజయ పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బయ్యారం: మండలంలోని ఇర్సులాపురంలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారుల నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. ఎమ్మెల్యే హరిప్రియ డీఎంఎఫ్‌టీ నిధులను విడుదల చేయటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఆర్ఎస్ఎస్ మండల కన్వీనర్ ఉప్పలయ్యయాదవ్, ఉపసర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని ఏపూరు జీపీ నుంచి శివారు టేకుల తండా వరకు 4 కిలోమీటర్లు రూ.4లక్షల నిధులతో బీటీ రోడ్డు పనులను సర్పంచ్ మౌనిక దిలీప్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బానోతు రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బానోతు శంకర్, భూక్య భిక్కు, మోతీలాల్, రామన్ననాయక్, చందు, భరత్, సుధాకర్, మోతీరాం పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

పెద్దవంగర: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన సంఘన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన బొమ్మెర ఉపేందర్ (38)కు కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినప్పటికీ నొప్పి నయం కాలేదు. శుక్రవారం ఉదయం తీవ్ర నొప్పి రావడంతో ఇంట్లో దూలానికి ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు ఆడపిల్లలు స్పందన, వైష్ణవి, కుమారుడు శివ ఉన్నారు. తండ్రి నాలుగేళ్ల క్రితం తండ్రి సోమయ్య తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. తల్లి లక్ష్మీనర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మహబూబాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ వై.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 31వ తేదీన మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో వ్యక్తి చనిపోయి ఉండగా హాస్పిటల్ సిబ్బంది గమనించారు. వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచారు. వ్యక్తి వయసు సుమారు 45నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, టీ షర్టు, బక్కపల్చగా ఉన్నాడు. గుర్తించిన వారు ఫోన్ నంబర్ 87126 56930 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

కొత్తగూడ: మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు. వేలబెల్లికి చెందిన మహిళ వారంతపు సంతలో సరుకులు తీసుకుని ఆటో కోసం వేచి చూస్తుండగా అదే గ్రామానికి చెందిన సురేష్ ద్విచక్రవాహనంపై లిఫ్ట్ అడిగి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలోని అటవీ ప్రాంతంలో మహిళపై లైంగిక దాడి చేసేందుకు యత్నించాడు. అతని బారి నుంచి తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దంతాలపల్లి: మండలంలోని పనిమటిగూడెం గ్రామానికి చెందిన ఆర్మూర్ల రాములు మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో గల ఆకేరు వాగు నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఎస్సై రమేష్‌బాబు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

ఇద్దరి రిమాండ్

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం గ్రామంలో రెండురోజుల క్రితం బొడ్రాయి వద్ద విద్యుత్ విషయంలో జరిగిన ఘర్షణ ఘటనలో భూక్య శ్రీను ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన కొండ రవి, కొండ వెంకన్నలపై కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్ల సమాచారాన్ని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తెలుసుకుని సదరు బాధితులకు అప్పగించామని టౌన్ సీఐ వై.సతీష్ శుక్రవారం తెలిపారు.

గార్ల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితులు బుడిగ మురళి, బాదావత్ యుగంధర్‌లకు ఎస్సై బానోత్ వెంకన్న శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

సంక్షిప్త సమాచారం

మాజీ సైనికుడికి సన్మానం



కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో ఆజాదీకి అమృతోత్సవ్ సందర్భంగా మాజీ సైనికోద్యోగి మల్లు చంద్రశేఖర్‌ను జీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'చెత్తాచెదారం తొలగించాలి' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి స్పందించి సైడ్ కాల్వలో పేరుకుపోయిన పూడిక, చెత్తచెదారంను సిబ్బందితో తీయించాడు.

నివాళి

గూడూరు: మండలంలోని తీగలవేణికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అల్లి నరేందర్‌రెడ్డి (55) బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, ఎండి. ఖాసీం, కేంద్రం మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ నివాళులర్పించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 12 జిల్లా కేంద్రంలోని నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ జిల్లా చాగంటి ప్రభాకర్, బలాష్టి రమేష్ పిలుపునిచ్చారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీరస్వామి, అనిత, మంజుభార్గవి, సువర్ణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రంజాన్ అలీ పాల్గొన్నారు.

గ్రంథాలయ పాలకుల దినోత్సవం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పాలకుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు, అధ్యాపకులు గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ ఎస్ఆర్.రఘునాథ్‌ను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం మల్లేషం, అధ్యాపలకు మమత, యుగేందర్, వేణుగోపాల్, రాజేందర్, శశికాంత్, బొంద్యాలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో శ్రామిక్ విభాగం కమిటీ ఎన్నిక

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఐఎఫ్‌టీయూ అనుబంధ ఆర్టీసీ డిపో శ్రామిక్ కార్మిక విభాగం నూతన కమిటీని శుక్రవారం నియమించారు. అధ్యక్షుడిగా బోగ రమేష్, గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి రవి, ఉపాధ్యక్షులుగా దంతాలపల్లి సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బానోతు మంగీలాల్, సహాయ కార్యదర్శిగా నర్మెట రాజు, కోశాధికారిగా శ్రీను ఎన్నికయ్యారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చిన్నగుడూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరుణాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోధకాలు వ్యాధిగ్రస్తులకు ఫైలేరియా కిట్ అందించారు. సర్పంచ్ పూలమ్మ పాల్గొన్నారు.

నివాళి

నెహ్రూసెంటర్: వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో అసువులు బాసిన మాల మృతవీరులకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, టీఎంఎం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు బెజ్జం ఐలయ్య, జిల్లా యువత అధ్యక్షులు నాయిని భరత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు (శనివారం) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఆపరేషన్ బి.శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తబజారులో..

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్తబజారులో ఉదయం 7గంటల నుంచి మధ్నాహ్నం 12గంటలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్య బుధవారం తెలిపారు. విద్యుత్‌లో ఏర్పడుతున్న సమస్యలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కమిటీ ఎన్నిక

కేసముద్రం: సాధికారత మండల సమాఖ్య నూతన కమిటీ అధ్యక్షురాలిగా మంద మౌనిక ఎన్నికైంది. శుక్రవారం మండల కేంద్రంలోని జరిగిన సాధికారత మండల సమాఖ్య 14వ వార్షిక సర్వసభ్య సమావేశం అనంతరం సీఆర్‌పీ రజిత ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎండి.హసీనా, కోశాధికారి ఉమారాణి, సహాయ కార్యదర్శి షమీనాబేగం, ఉపాధ్యక్షురాలిగా శోభ ఎన్నికైనట్లు తెలిపారు.

పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



కురవి: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం మండల కేంద్రంలోని గుడిసెంటర్ వద్ద కలుసుకున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కురవిలో కొంత సమయం ఆగారు. ఆయనను కాంగ్రెస్ నాయకులు వీరభద్రం, కరుణాకర్‌రెడ్డి, నారాయణ రాజేందర్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, రజనీకాంత్, శ్రీనివాస్, వీరన్న సన్మానించారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి

తొర్రూరు: పద్మశాలీల అభ్యున్నతికి ప్రముఖులు కృషి చేయాలని వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ఎన్నారై మునుకుంట్ల రమేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో శుక్రవారం పద్మశాలీ ప్రముఖుల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించేందుకు పద్మశాలీలకు డబ్ల్యూడబ్ల్యూఓ సంస్థ పూర్తి సహకారమందిస్తుందని తెలిపారు. చేనేత, పవర్ లూం కార్మికులకు ఉపాధి కల్పించేందుకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరల ఆర్డర్లను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా కోశాధికారి పెండెం రమేష్, ప్రతినిధులు వేముల భార్గవ, ఈశ్వర్, వెంకటేశ్వర్లు, పులేందర్, రవీందర్, ఉప్పలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రముఖులు

తనిఖీలు పారదర్శకంగా ఉండాలి



పెద్దవంగర: ఉపాధి హామీ పథకంలో చేపట్టుతున్న తనిఖీలు పారదర్శకంగా ఉండాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక బృందం చేసిన తనిఖీలను ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో డీఆర్‌పీ. అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జ్యోతిర్మయి, అడిషనల్ పీడీ గోవిందరావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ నర్సయ్య, జిల్లా గ్రీవెన్స్ అధికారి ఆదాము, జిల్లా విజిలెన్స్ సహాయ అధికారి యాకుబ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.